ADMISSIONS ARE IN PROGRESS 2024-25
Secretary & Correspondent
Bikki Venkateshwarlu
M.Sc (Physicis), M.Ed.
Join your kids with us &
Empower their Academic Excellence with Ethical Foundations
INDIRA VIDYALAYA
Nursery to VII class, English Medium
Near Bodrai, Mahabubabad.
Cell: 9701912300, 9705412300

దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 01 సంచిక : 346 శుక్రవారం 13-12-2024 ఎడిటర్ : వేముల అయోధ్య రాములు పేజీలు : 4 వెల : 5 రూ/..

## సీఎం రేవంత్ రెడ్డి దిల్లీ పర్యటన

**పలువురు కేంద్రమంత్రులతో భేటీ**

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డితో సీఎం భేటీ**

**రాహుల్ గాంధీతో భేటీ అయ్యే అవకాశం**



**న్యూఢిల్లీ,డిసెంబర్ 12:** సీఎం రేవంత్ రెడ్డి దిల్లీ పర్యటనలో ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన పలువురు కేంద్రమంత్రులను కలిశారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్? రెడ్డితో సీఎం రేవంత్ భేటీ అయ్యారు. అనంతరం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్?ను కూడా రేవంత్ రెడ్డి కలిశారు. దిల్లీ పర్యటనలో భాగంగా కాంగ్రెస్? పార్టీ అగ్రనేత రాహుల్? గాంధీతో పాటు సీనియర్? నేతలను కూడా ఆయన కలిసే అవకాశం ఉంది. పీసీసీ కార్యవర్గం ఎంపిక, మంత్రివర్గ విస్తరణ అంశాలపై అధిష్ఠానంతో చర్చించే ఛాన్స్ ఉంది. రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్? ఎంపీలతో ఇవాళ రాత్రి రేవంత్ రెడ్డి భేటీ కానున్నారు. రాష్ట్రానికి సంబంధించి పార్లమెంట్?లో ప్రస్తావించాల్సిన అంశాలపై ఎంపీలకు సీఎం దిశానిర్దేశం చేసే అవకాశం ఉంది.



## ధరణి పోర్టల్ సేవలు తాత్కాలికంగా నిలిపివేత

**డేటాబేస్ వెర్షన్ అప్ గ్రేడ్ కారణంగా నిలుపుదల**

**డిసెంబర్ 16వరకు సేవలకు అంతరాయం**

**తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం**

**తొలి సమయం, హైదరాబాద్, డిసెంబర్ 12:** ధరణి పోర్టల్ సేవలకు సంబంధించి తెలంగాణ సర్కార్ కీలక అప్డేట్ ఇచ్చింది. డిసెంబర్ 16వ తేదీ వరకు పోర్టల్ సేవలు తాత్కాలికంగా అందుబాటులో ఉండవని ఓ ప్రకటనలో పేర్కొంది. డేటాబేస్ వెర్షన్ అప్ గ్రేడ్ కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. 16వ తేదీ ఉదయం వరకు అప్ గ్రేడ్ ప్రక్రియ ముగిసే అవకాశం ఉంటుందని వివరించింది. ధరణి పోర్టల్ బాధ్యతలను కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్ఐసీకి అప్పగించిన సంగతి తెలిసిందే. ఇదే విషయంపై ఇటీవలే మీడియాతో మాట్లాడిన మంత్రి పొంగులేటి.. కీలక విషయాలను వెల్లడించారు. నిపుణుల కమిటీ రిపోర్టు ఆధారంగా ధరణి పోర్టల్ ను ఎలా ప్రక్షాళన చేయాలని చూస్తున్నామన్నారు. ప్రజలకు మంచి జరిగేలా ధరణి పోర్టల్ లో మార్పులు చేస్తామని చెప్పుకొచ్చారు. 2020 ఆర్వోఆర్ చట్టంలో లోపాలు సరిచేసి 2024 ఆర్వోఆర్ చట్టం తెస్తున్నట్లు మంత్రి పొంగులేటి ప్రకటించారు. కొత్త ఆర్వోఆర్ చట్టాన్ని 9వ తేదీ నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టి ఆమోదిస్తామన్నారు. ధరణి కొత్త యాప్, కొత్త చట్టం సామాన్యులకు చాలా ఉపయోగపడుతుందని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వీఆర్వో వ్యవస్థను రాత్రికి రాత్రే రద్దు చేసిందన్నారు. అయితే రెవెన్యూ గ్రామాలకు ఒక అధికారి ఉండాలనేది స్థానికులు అభిప్రాయం అన్నారు. భూముల నిర్వహణకు సంబంధించి తెలంగాణలో కొత్త చట్టం రాబోతుంది. ఇప్పటికే 'ది తెలంగాణ రికార్డ్ ఆఫ్ రైట్స్ బిల్-2024' ముసాయిదాను కూడా ప్రవేశపెట్టింది. ఈ బిల్లుపై ప్రజాభిప్రాయాలను సేకరించారు. ఇప్పుడు జరగబోయే. అసెంబ్లీ సమావేశాల్లో ఆర్వోఆర్ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదముద్ర వేసే అవకాశం ఉంది. ఈ ముసాయిదా బిల్లు పేర్కొన్న వివరాల ప్రకారం.. ప్రతి భూకమతానికి తాత్కాలిక, శాశ్వత భూదార్ (ప్రత్యేక గుర్తింపు సంఖ్య) ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుత రికార్డులను పరిశీలించి తాత్కాలిక సంఖ్య ఇస్తారు. సర్వే చేసిన తర్వాత శాశ్వత భూదార్ కేటాయిస్తారు. 2020లో తీసుకొచ్చిన ఆర్వోఆర్ చట్ట ప్రకారం%ొ% చాలా ఇబ్బందులు ఉన్నాయి. అప్పీల్, రివిజన్ వ్యవస్థలు లేకపోవటంతో భూ యజమానులకు అనేక సమస్యలు ఏర్పడ్డాయి. కలెక్టర్లకు ఎక్కువ అధికారాలు ఉండటంతో క్షేత్రస్థాయిలోని అధికారులు ఏం చేయలేని పరిస్థితి ఉండేది. అయితే కొత్త చట్టంలో మూడంచెల అప్పిలేట్ అథారిటీలను నియమించనున్నారు. తహసీల్దారు, ఆర్డీవోల మ్యుటేషన్లపై అభ్యంతరాలను స్వీకరించే అవకాశం ఉంది. ఆర్వోఆర్ రికార్డుల్లో తప్పులుంటే వాటిపై మొదటి అప్పీలుపై రివిజన్ అధికారాలు కలెక్టర్ లేదా అదనపు కలెక్టర్‌కు ఇవ్వనున్నారు, ఇక రెండో అప్పీలుపై సీసీఎల్ఏకు, మూడో అప్పీలుపై ప్రభుత్వానికి చేసుకునే వీలు ఉంటుంది. కొత్త చట్టం ద్వారా పహాణీలను కూడా అప్డేట్ చేస్తారు. ఇందుకు సంబంధించి డిసెంబర్ 16వ తేదీ నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో పూర్తిస్థాయిలో క్లారిటీ రానుంది.

## వన్ నేషన్ వన్ ఎలక్షన్

**జమిలి ఎన్నికలకు కేంద్ర కేబినెట్ ఆమోదం**

**పార్లమెంట్‌లో బిల్లు పెట్టేందుకు సిద్ధమైన కేంద్రం**




**న్యూఢిల్లీ,డిసెంబర్ 12:** జమిలి ఎన్నికలకు కేంద్ర కేబినెట్ ఆమోదం లభించింది. ఈ మేరకు పార్లమెంట్‌లో వన్ నేషన్ వన్ ఎలక్షన్ బిల్లు పెట్టేందుకు కేంద్రం సిద్ధమైంది. గతంలోనే జమిలి ఎన్నికలకు సంబంధించి కోవింద్ కమిటీ సిఫార్సులకు కేబినెట్ ఆమోద్రముద్ర వేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కొనసాగుతున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లోనే జమిలి ఎన్నికల బిల్లు ప్రవేశపెట్టే అవకాశం ఉంది. జమిలి దిశగా కేంద్రం తీవ్రంగా కసరత్తు చేస్తున్న విషయం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం జమిలికే మొగ్గు చూపుతుండడంతో దీనికోసం ఉన్న అడ్డంకులన్నీ తొలగించుకునేందుకు రెడీ అవుతోంది. పార్లమెంట్ %శీ% పంచాయితీ ఎన్నికలు అన్నీ ఒకేసారి నిర్వహించేందుకు సమాయత్తం చేస్తోంది. మొత్తం రెండు దశల్లో ఈ ఎన్నికలు జరగనున్నాయి. తొలి దశలో పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలు.. అవిపూర్తైన వందరోజుల్లోపు స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగుతాయి. దీనికోసం దేశవ్యాప్తంగా ఒకే ఓటరు జాబితాను ఉపయోగించబోతున్నారు. జమిలి ఎన్నికలు.. అంటే.. వన్‌నేషన్, వన్ ఎలక్షన్. దేశానికి ఒక్కసారే ఎన్నికలు.. మిగిలిన ఐదేళ్లూ పరిపాలనపై దృష్టిపెట్టాలన్న దృక్పథంతో జమిలిని తెరపైకి తీసుకొచ్చారు. 1952లో తొలి సాధారణ ఎన్నికల నుంచి 1967 వరకు లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీలకు చాలావరకు ఒకేసారి ఎన్నికలు జరిగాయి. అయితే తర్వాతి కాలంలో సుస్థిర ప్రభుత్వాలు ఏర్పడకపోవడం, గడువుకు ముందే పలు రాష్ట్రాల శాసనసభలను బర్తరఫ్ చేయడం వంటి కారణాలతో జమిలి ఎన్నికలు పట్టాలు తప్పాయి. దీంతో లోక్‌సభ, అసెంబ్లీలకు వేర్వేరుగా ఎన్నికలు జరపడం మొదలైంది. జమిలి ఎన్నికలు జరగాలంటే దాదాపు 18 రాజ్యాంగ సవరణలు, ప్రజా ప్రాతినిధ్య చట్టంలో మార్పులు చేయాల్సిన అవసరం ఉన్నదని కోవింద్ కమిటీ చెప్పింది. ముఖ్యంగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 356, ఆర్టికల్ 324, ఆర్టికల్ 83(2), ఆర్టికల్ 172(1), ఆర్టికల్ 83కు సంబంధించి పలు సవరణలు అవసరమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జమిలి ఎన్నికలకు సంబంధించి రాజ్యాంగ సవరణలతో కూడిన బిల్లును పార్లమెంట్ ఉభయ సభలు కనీసం 67 శాతం సానుకూల ఓట్లతో ఆమోదించాల్సి ఉంటుంది. అంతేకాకుండా.. ఎన్నికల అంశం ఉమ్మడి జాబితాలో ఉన్న నేపథ్యంలో ఈ బిల్లుకు దేశంలోని కనీసం సగం రాష్ట్రాల అసెంబ్లీలు ఆమోద ముద్రవేయాలి. అంటే 543 స్థానాలున్న లోక్‌సభలో కనీసం 67 శాతం అంటే.. 362 ఎంపీలు ఈ బిల్లుకు అనుకూలంగా ఓటువేయాలి. దీంతోపాటు రాజ్యసభలో 245 సీట్లలో 67 శాతం అంటే 164 మంది సభ్యులు ఈ బిల్లును సమర్థించాలి.

## రైతుకు బేడీలు వేయడం అమానవీయం

**రేవంత్ క్రూర మనసత్వానికి నిదర్శనం**

**లగచర్ల రైతులకు అండగా ఉంటాం**

**గవర్నర్ కూడా అంశంపై విచారణకు ఆదేశించాలి**

**బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**తొలి సమయం హైదరాబాద్,డిసెంబర్ 12** గుండెపోటుకు గురయిన లగచర్ల గిరిజన రైతు హీర్యా నాయక్‌కు బేడీలు వేయడం అమానవీయం, రేవంత్ క్రూర మనసత్వానికి నిదర్శనమని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు. జైలులో ఉన్న రైతు బిడ్డ హీర్యా నాయక్‌కు నిన్న గుండెల్లో నొప్పి వస్తే.. వైద్య సహాయం అందించడంలో ప్రభుత్వం అలసత్వం చూపిందని మండిపడ్డారు. ఈ వ్యవహారాన్ని కుటుంబసభ్యులకు చెప్పకుండా, బయటకు చెప్పకుండా దాచిపెట్టే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. ఆస్పత్రికి తరలించకుండా.. చికిత్స అందించకుండా అమానవీయంగా వ్యవహరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంగారెడ్డి జైలులో ఉన్న లగచర్ల రైతు హీర్యా నాయక్ గుండెపోటుకు గురవగా అతడిని బేడీలతోనే ఆస్పత్రికి తరలించడం తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. ఈ అంశాన్ని ఖండిస్తూ హైదరాబాద్‌లోని నంది నగర్‌లో ఉన్న తన నివాసంలో కేటీఆర్ విలేకరుల సమావేశం నిర్వహించారు. రేవంత్ రెడ్డి రైతులను మోసం చేస్తోందని.. బేడీలు వేసి అవమానించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా లగచర్ల రైతులకు తాము అండగా ఉంటామని ప్రకటించారు. 'హీర్యా నాయక్‌తోపాటు లగచర్ల రైతులు రాఘవేంద్ర, బసప్ప ఆరోగ్యం బాగాలేదని.. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డికి అనేక ఆరోగ్య సమస్యలు ఉన్నాయి' అని కేటీఆర్ వివరించారు. రైతుబిడ్డకు బేడీలు వేసి అన్యాయంగా.. అమానవీయంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆసుపత్రికి తీసుకువచ్చింది. స్ట్రెచర్‌పై.. అంబులెన్స్‌లో తీసుకురావాల్సిన మనిషిని బేడీలు వేసి తీసుకువచ్చారు. ఇంతటి దుర్మార్గమైన అమానవీయమైన ప్రవర్తన క్షమార్హం కాదు' అని మాజీ మంత్రి కేటీఆర్ హెచ్చరించారు.


## 18 ఏళ్లకే ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా నిలిచిన భారతీయుడు

**పిన్నవయస్సులో ఛాంపియన్‌గా అవతరించిన గుకేశ్**

**గుకేశ్‌కు రాష్ట్రపతి, ప్రధాని అభినందనలు**

**మన దేశం గర్వపడేలా చేశారంటూ రాష్ట్రపతి ట్వీట్**

**గుకేశ్ పేరు సుస్థిరంగా నిలుస్తుందన్న ప్రధాని మోదీ**



**న్యూఢిల్లీ,డిసెంబర్ 12:** భారత యువ గ్రాండ్ మాస్టర్ గుకేశ్ ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా అవతరించాడు. చివరిదైన 14వ గేమ్‌లో చైనాకు చెందిన లిరెన్‌ను ఓడించిన గుకేశ్ ప్రపంచ ఛాంపియన్ షిప్ ను కైవసం చేసుకున్నాడు. అత్యంత చిన్న వయసులో 18 ఏళ్లకే గుకేశ్ ఈ ఘనత సాధించి చరిత్ర సృష్టించాడు. మొత్తం 14 గేమ్‌లలో గుకేశ్ 3, లిరెన్ 2 గేమ్‌లో విజయం సాధించారు. తొమ్మిది గేమ్‌లు డ్రా అయ్యాయి. ఈ క్షణం కోసం తాను పదేళ్లుగా కలలు కన్నానని గుకేశ్ అన్నాడు. తన కల నెరవేరినందుకు ఎంతో సంతోషంగా ఉందన్నాడు. ఈ విజయాన్ని తాను ఊహించలేదని, ఈ ఘనత సాధించగానే భావోద్వేగానికి లోనయ్యానన్నాడు. తన దృష్టిలో లిరెన్ నిజమైన ప్రపంచ ఛాంపియన్ అని పేర్కొన్నాడు. లిరెన్‌కు అతను ధన్యవాదాలు తెలిపాడు. ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌గా నిలిచిన గుకేశ్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్రమోదీ అభినందనలు తెలిపారు. ఎక్స్ వేదికగా వారు ట్వీట్ చేశారు. ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ గెలిచిన అతి పిన్న వయస్కుడిగా నిలిచినందుకు గుకేశ్‌కు హృదయపూర్వక అభినందనలు... మన దేశం గర్వపడేలా చేశారంటూ రాష్ట్రపతి ట్వీట్ చేశారు. గుకేశ్ విజయం చారిత్రాత్మకమైనది... ఎంతోమంది యువతకు ప్రేరణనిచ్చేదని ప్రధాని మోదీ పేర్కొన్నారు. గుకేశ్ అద్భుతమైన విజయం సాధించారని ప్రశంసించారు. అతడి అసమాన ప్రతిభ, కృషి, సంకల్పాల ఫలితమే ఈ విజయమని పేర్కొన్నారు. ఈ విజయం చెస్ చరిత్రలో గుకేశ్ పేరును సుస్థిరం చేయడమే కాకుండా లక్షలాది మంది యువతకు గొప్ప కలలు కనేందుకు ప్రేరణగా నిలుస్తుందన్నారు. కాగా, చెస్‌కు, భారత్‌కు, డబ్ల్యుసీఏకు, తనకూ ఇది గర్వించదగ్గ విషయమని విశ్వనాథన్ ఆనంద్ పేర్కొన్నారు.

## పొరపాట్లకు తావులేకుండా సర్వే

**- ఈనెల 31లోగా దరఖాస్తుల పరిశీలన పూర్తి - మంత్రి పొంగులేటి కీలక ఆదేశాలు జారీ**



**తొలి సమయం హైదరాబాద్,డిసెంబర్ 12 :** ఇందిరమ్మ ఇండ్ల విషయంలో ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి కీలక ఆదేశాలు జారీ చేశారు. దరఖాస్తుల పరిశీలనకు డెడ్‌లైన్ విధించిన మంత్రి.. పొరపాట్లకు తావులేకుండా సర్వే నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి దరఖాస్తుల పరిశీలనను పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా. ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన, సామాజిక సర్వే తదితర అంశాలపై సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు మంత్రి. ఈకార్యక్రమంలో సీఎం సలహాదారు, సీఎస్ పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రజా పాలనలో వచ్చిన 80 లక్షల దరఖాస్తుల పరిశీలనను ఈనెల 31 లోగా పూర్తిచేయాలని మంత్రి ఆదేశించారు. పరిశీలన చేసిన సర్వే వివరాలను మొబైల్ యాప్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. దీనికి సంబంధించి ప్రతి 500 మందికి ఒక సర్వేయర్‌ను నియమించుకోవాలన్నారు.

## 175 నియోజకవర్గాల్లో పరిశ్రమల ఏర్పాటు

**యువతకు ఉద్యోగాల కల్పనే ధ్యేయం : నారా చంద్రబాబు నాయుడు**

**అమరావతి,డిసెంబర్ 12:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన కలెక్టర్ల సమావేశం జరిగింది. ఇందులో భాగంగా పరిశ్రమల శాఖపై ఆ శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఎంతమంది యువతకు ఉపాధి, ఉద్యోగాలు కల్పించారన్నది ముఖ్యమని వ్యాఖ్యానించారు. 175 నియోజకవర్గాల్లో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేయాల్సి ఉందని వెల్లడించారు. భూసేకరణ సమయంలో స్థానిక రైతులను కూడా భాగస్వాములను చేయాలని సీఎం ఆదేశించారు. ఆర్సెలార్ మిట్టల్ పరిశ్రమ, రామాయపట్నం వద్ద బీపీసీఎల్ రిఫైనరీ ఇలా వేర్వేరు పరిశ్రమలకు భూమి అవసరమని పేర్కొన్నారు. అమరావతి తరహాలోనే రైతులను పరిశ్రమలకు భూములిచ్చే అంశంలో భాగస్వాములను చేయాల్సిందిగా అధికారులకు సూచనలు చేశారు. వివిధ రంగాల్లో ఎంఎస్ఎంఈలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసేలా ప్రోత్సహించాలని స్పష్టం చేశారు. ఎంఎస్ఎంఈలను ఎన్యుమరేషన్ చేయించే పని త్వరితగతిన పూర్తి కావాలని సూచించారు. ఒక పరిశ్రమ తయారు చేసిన ఉత్పత్తి మరో పరిశ్రమకు ముడి సరుకు అవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అభిప్రాయపడ్డారు. 20 లక్షల ఉద్యోగాల కల్పనపై కేబినెట్ సబ్ కమిటీ కూడా వేశారని మంత్రి లోకేష్ అన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విషయంలోనూ చర్యలు తీసుకోవాలని మంత్రి కోరారు. ప్రతీ పెట్టుబడి విషయంలోనూ కలెక్టర్లు జాగ్రత్తగా డీల్ చేయాలన్నారు.

ఆర్సెలార్ మిట్టల్‌కు ఎన్ఎండీసీ ముడి ఇనుము ఇచ్చేందుకు ముందుకు వచ్చిందని.. పైప్ లైన్ ద్వారా ముడి ఇనుము ఖనిజం వచ్చేలా చేయాలని కోరుతున్నారని లోకేష్ తెలిపారు. ఈ పరిశ్రమ ఏర్పాటు కోసం ఉక్కుమంత్రికి, ఎన్ఎండీసీకి స్వయంగా నేనే ఫోన్ చేసి ఫాలోఅప్ చేస్తున్నాని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. కలెక్టర్లు కూడా పెట్టుబడుల విషయంలో ఇదే తరహాలో సీరియస్‌గా ఫాలోఅప్ చేయాలని సూచించారు. "నేను మంత్రిని, కలెక్టర్‌ను అంతా నా దగ్గరకే రావాలన్న ఆలోచన వదిలేయాలి" అని సీఎం సూచించారు. గత ప్రభుత్వ హయాంలో పెట్టిన ఇబ్బందుల కారణంగా ఏపీకి మళ్లీ రాబోమని వెళ్లిపోయారని దాన్ని సరిదిద్దేందుకు నానా తంటాలు పడుతున్నామని సీఎం వ్యాఖ్యానించారు.

ప్రాజెక్టు ఆలస్యమైతే వారికి వయబిలిటీ విషయంలో ఇబ్బందులు వస్తాయని ఆ కారణంగా ఇతర రాష్ట్రాలవైపు వారు చూసే అవకాశం ఉందన్నారు. అందుకే స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై పదేపదే చెబుతున్నట్టు వెల్లడించారు. పర్యాటకం కూడా ఉపాధి కల్పనలో కీలకమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# సంక్రాంతిలోపే కేబినెట్ విస్తరణ!!

**ఫోకస్ పెట్టిన కాంగ్రెస్ హైకమాండ్**

**ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**రాహుల్ గాంధీని కలిసి కేబినెట్ విస్తరణపై చర్చ**

**క్యాబినెట్ విస్తరణపై జోరుగా ప్రచారం**

**తొలి సమయం, హైదరాబాద్,డిసెంబర్ 12:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయింది. ఇప్పటికీ సీఎం రేవంత్ రెడ్డి సహా మరో 11 మంది మంత్రులతోనే రేవంత్ సర్కార్ నడుస్తోంది. ఇంకా మరో ఆరుగురికి కేబినెట్‌లో అవకాశం ఉంది. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనకు వెళ్లిన ప్రతీ సారి క్యాబినెట్ విస్తరణ జరుగుతుందని బాగా ప్రచారం జరిగింది. కానీ ఇతర రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా కాంగ్రెస్ హైకమాండ్ ఆదిశగా అడుగులు లేయలేదు. కొత్త యేడాదిలో సరికొత్త జోష్‌తో తెలంగాణ ప్రభుత్వాన్ని నడిపిస్తానని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. సీఎం ప్రకటనకు తగినట్టుగానే సంక్రాంతిలోపే కేబినెట్ విస్తరణ కోసం తెలంగాణ ప్రభుత్వం సీరియస్‌గా ఆలోచిస్తోంది. ఇప్పటికే ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో కేబినెట్ విస్తరణపై కాంగ్రెస్ హైకమాండ్ కూడా ఫోకస్ పెట్టింది. దీంతో తెలంగాణ కాంగ్రెస్ రాజకీయం ఢిల్లీకి చేరింది. కేబినెట్‌లో కొత్త ముఖాల జాబితా షార్ట్ లిస్ట్ చేసుకుని సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఢిల్లీలో అధిష్టానం ముందు ఉంచారు. ఇప్పటికే రాహుల్ గాంధీని కలిసి కేబినెట్ విస్తరణపై చర్చించారు. తమ అనుచరులకు కేబినెట్ బెర్తులు ఇవ్వాలని అటు రేవంత్ రెడ్డి, ఇటు భట్టి విక్రమార్క పార్టీ హైకమాండ్‌కి విజ్ఞప్తి చేసినట్లు తెలుస్తోంది.. అయితే.. దీనిపై మళ్లీ రాహుల్ గాంధీతో చర్చించి ఫైనల్ గా నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.. సీఎం రేవంత్ రెడ్డి క్యాబినెట్ లో 11 మంది మంత్రులు ఉండగా ఉమ్మడి జిల్లాల వారీగా చూస్తే ఆదిలాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు మాత్రం ప్రాతినిధ్యం దక్కలేదు. ఎమ్మెల్యేల సంఖ్య ప్రకారం ఇంకా ఆరుగురు కొత్త వారికి కేబినెట్‌లో చోటుకి అవకాశం ఉంది. దీంతో కచ్చితంగా ఈ నాలుగు ఉమ్మడి జిల్లాల వారికి కేబినెట్ విస్తరణలో బెర్త్ కచ్చితంగా దక్కే అవకాశం ఉంది. ఈ నాలుగు ఉమ్మడి జిల్లాలకు మంత్రి పదవులతో పాటు మిగిలిన మరో రెండు పదవులు ఎవరికి ఏ జిల్లాకు దక్కుతాయనే ఉత్కంఠ తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో నెలకొంది. అయితే.. కేబినెట్ విస్తరణలో మిగిలిన మంత్రి పదవుల భర్తీతో పాటు ఇప్పుడు మంత్రులకు ఉన్న శాఖలు మార్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. కేబినెట్ విస్తరణతో పాటు ఇప్పటికీ ఖాళీగా ఉన్న డిప్యూటీ స్పీకర్, ప్రభుత్వ చీఫ్ విప్ పోస్టులను కూడా భర్తీ చేస్తారని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. తాజాగా సీఎం, డిప్యూటీ సీఎం ఢిల్లీ టూర్ల నేపథ్యంలో సంక్రాంతి నుంచి పూర్తి సైన్యంతో సీఎం రేవంత్ రెడ్డి పాలన పరుగులు పెట్టించనున్నారని కాంగ్రెస్‌లో జోష్ కనిపిస్తోంది..

# అణు విద్యుత్ ఉత్పత్తిలో ముందున్నాం

**60 ఏళ్లలో సాధించలేనిది.. రెండు దశాబ్దాల్లో సాధించాం**

**వచ్చే పదేళ్లలో మూడు రెట్లు పెరగనున్న అణుశక్తి సామర్థ్యం**

**కేంద్ర అణుశక్తి శాఖ మంత్రి జితేంద్ర సింగ్**

**లోక్‌సభలో సమావేశాల్లో ప్రకటన**

**న్యూఢిల్లీ,డిసెంబర్ 12:** భారత అణు విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గత దశాబ్ద కాలంలో 2014లో 4,780 మెగావాట్ల నుంచి 2024 నాటికి 8,081 మెగావాట్లకు చేరుకుందని కేంద్ర అణుశక్తి శాఖ మంత్రి జితేంద్ర సింగ్ బుధవారం లోక్‌సభలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2031-32 నాటికి అణుశక్తి సామర్థ్యం మూడు రెట్లు పెరిగి 22,480 మెగావాట్లకు చేరుకుంటుందని తెలిపారు. ప్రస్తుతం తొమ్మిది అణు విద్యుత్ ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయని, అనేక ఇతర ప్రాజెక్టులు ప్రీ-ప్రాజెక్ట్ దశలో ఉన్నాయని, అణుశక్తి సామర్థ్యాన్ని విస్తరించడంలో భారత్ ముందు వరుసలో ఉందన్నారు. 10 అణు రియాక్టర్లకు పెద్దమొత్తంలో ఆమోదం, పెరిగిన నిధుల కేటాయింపులు, ప్రభుత్వ రంగ సంస్థలతో సహకారం, పరిమిత ప్రైవేట్ రంగ భాగస్వామ్యంతో సహా అనేక కార్యక్రమాల వల్ల అణు విద్యుత్ ఉత్పత్తి పెరిగిందన్నారు. గడిచిన 60 ఏళ్లలో సాధించలేనిది, గత రెండు దశాబ్దాల్లో సాధించినట్లు ఆయన చెప్పుకొచ్చారు. వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ, రక్షణ రంగం వంటి వివిధ రంగాలలో అణు విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం పెరిగిందని ఆయన చెప్పుకొచ్చారు. అలాగే ఆయన థోరియంపై కూడా మాట్లాడారు. భారత్ దేశంలో 21 శాతం థోరియం నిల్వలు ఉన్నట్లు ఆయన వెల్లడించారు. భారత్ యురేనియంపై ఆధారపపడం తగ్గించాలని చూస్తుందని.. అందుకే భవానీ ప్రాజెక్టు ద్వారా థోరియం నిల్వలను అన్వేషిస్తున్నట్లు ఆయన చెప్పుకొచ్చారు.గత 10 ఏళ్లలో భారతదేశం విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని రెట్టింపు అయినట్లు, 2031-32 నాటికి మూడు రెట్లు పెంచాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుందని మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. 2031-32, 22,480 మెగావాట్లకు చేరుకుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.2014 తర్వాత రాజకీయ నాయకత్వం అందించిన ఎనేబుల్ పరిసరాలు కీలకంగా మారినట్లు వెల్లడించారు.

# మార్చి 1నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు

**మార్చి 3నుంచి ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు**

**పరీక్ష షెడ్యూల్‌ను విడుదల చేసిన ఏపీ విద్యాశాఖ**

**అమరావతి,డిసెంబర్ 12 :** ఏపీ ఇంటర్మీడియేట్ పరీక్ష షెడ్యూల్ విడుదలైంది. వచ్చే ఏడాది మార్చి 1వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు కొనసాగనున్నాయని విద్యాశాఖ తెలిపింది. అలాగే మార్చి 3వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగా పరీక్ష షెడ్యూల్‌ను విడుదల చేసిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ .. పరీక్షలు రాసే విద్యార్థులందరికీ ఆల్ ది బెస్ట్ చెప్పారు.

# జైలులో గుండెపోటుకు గురైన లగచర్ల రైతు

**- బేడీలతోనే లగచర్ల రైతు ఆస్పత్రికి తరలింపు - తెలంగాణ పోలీసులు మరో దారుణం**

**- ఆగ్రహం వ్యక్తం చేసిన బీఆర్ఎస్ పార్టీ- ఘటనపై పోలీసులపై ముఖ్యమంత్రి ఆగ్రహం**

**- ప్రజా ప్రభుత్వం ఇలాంటి చర్యలను సహించదని హెచ్చరిక**

**తొలి సమయం, హైదరాబాద్,డిసెంబర్ 12:** తెలంగాణలో లగచర్ల రైతుల పోరాటం తీవ్ర రాజకీయ పరిణామాలకు దారి తీసిన విషయం తెలిసిందే. అయితే అధికారులపై దాడికి పాల్పడ్డారనే ఆరోపణలతో ఆ గ్రామ రైతులను అరెస్ట్ చేసి జైలులో ఉంచిన విషయం తెలిసిందే. వారికి సంబంధించి కేసు విచారణలో ఉంది. అయితే దాడి నెపంతో అమాయక రైతులపై పోలీసులు క్రూరంగా ప్రవర్తిస్తున్నారు. ఇప్పటికే లగచర్లలో బీభత్సం సృష్టించిన పోలీసులు తాజాగా మరో దారుణానికి పాల్పడ్డారు. అనారోగ్యానికి గురయిన లగచర్ల రైతును బేడీలతోనే ఆస్పత్రికి తరలించడం సంచలనంగా మారింది. పోలీసుల చర్య రాజకీయ దుమారం రేపింది. ఆ వ్యవహారంపై బీఆర్ఎస్ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేయగా.. ప్రతిపక్షాలు మండిపడుతుండడంతో ముఖ్యమంత్రి స్పందించి సంబంధిత పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వికారాబాద్ జిల్లాలోని రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లోని లగచర్లలో ఫార్మా విలేజ్ ఏర్పాటుపై తీవ్ర వివాదాస్పదమైన విషయం తెలిసిందే. ఆ సమయంలో రైతులు తీవ్రంగా వ్యతిరేకించిన సమయంలో అధికారులను ఘెరావ్ చేశారు. అధికారులపై దాడికి పాల్పడ్డారనే కారణంతో అమాయక రైతులను అరెస్ట్ చేశారు. కొందరు సంగారెడ్డి రెడ్డి జైలులో ఉండగా.. మరికొందరు ఇతర జైళ్లల్లో ఉన్నారు. తాజాగా అరెస్టయిన రైతుల్లో ఇద్దరు అనారోగ్యానికి గురయ్యారు. సంగారెడ్డి జైల్లో ఉన్న లగచర్ల రైతు హీర్యా నాయక్‌కు గుండె నొప్పి వస్తే ఆ సమాచారం బయటకు రాకుండానివ్వకుండా ఆస్పత్రికి తరలించారు. లగచర్ల రైతు హీర్యా నాయక్‌ను చికిత్స కోసం సంగారెడ్డి ఆసుపత్రికి బేడీలతో తీసుకెళ్లడంపై రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై అధికారులను సీఎం ఆరా తీశారని సమాచారం. రైతుకు బేడీలు వేసి తీసుకెళ్లాల్సినంత అవసరం ఏమొచ్చిందని అధికారులను నిలదీసినట్లు తెలుస్తోంది.

ఘటనపై విచారణ జరిపి పూర్తి నివేదిక సమర్పించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రజా ప్రభుత్వం ఇలాంటి చర్యలను సహించదని హెచ్చరించారని సీఎంఓ వర్గాలు వెల్లడించాయి. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, హరీశ్ రావుతోపాటు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తదితరులు ఈ సంఘటనను ఖండించారు.

# మోదీ నాయకత్వంలో భారత్‌లో గణనీయమైన పురోగతి

**- ప్రపంచంలో అత్యంత వేగంగా భారత్ అభివృద్ధి - డిజిటల్ ఆవిష్కరణలతో అత్యంత పురోగతి**

**- సాంకేతికత, మౌలిక సదుపాయాలు - భారత ప్రధానిపై రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రశంసలు**

**న్యూఢిల్లీ,డిసెంబర్ 12:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో.. భారతదేశం సాంకేతికత, మౌలిక సదుపాయాలు, డిజిటల్ ఆవిష్కరణలతో సహా అనేక రంగాలలో గణనీయమైన పురోగతిని సాధించింది. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా.. భారత్ తన స్థానాన్ని పటిష్టం చేసుకుంది.. దీనంతటికీ.. మోదీ సర్కార్ తీసుకున్న నిర్ణయాలు కారణమని.. అందుకే భారత్ ప్రపంచంలోని శక్తివంతమైన దేశాల్లో ఒకటిగా నిలుస్తుందంటూ పలువురు విదేశీ నేతలు ప్రశంసలు కురిపిస్తున్నారు.. ఇదే విషయాన్ని స్వయంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ .. పలు వేదికలపై మాట్లాడటం ఆసక్తి రేపుతోంది.. ఇటీవల రష్యాలో జరిగిన కార్యక్రమంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్.. భారత ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వం.. దార్శనికతను ప్రశంసించారు.. ఆయన మార్గదర్శకత్వంలో భారతదేశం తీసుకున్న ముఖ్యమైన అభివృద్ధి చర్యలను హైలైట్ చేయడంతోపాటు.. అదంతా మోదీ క్రెడిట్ అంటూ పేర్కొన్నారు.. తాను పిఎం మోదీ తరచూ మాట్లాడుతానని పేర్కొన్న పుతిన్.. 'మేక్ ఇన్ ఇండియా', ఆత్మ నిర్భర్ భారత్ వంటి ప్రధాని కార్యక్రమాల పట్ల ప్రశంసలు కురిపించారు.. దేశ అభివృద్ధికి అతని ముందున్న ఆలోచనా విధానాన్ని అభినందించారు. భారతదేశాన్ని సాంకేతికంగా అభివృద్ధి చెందిన భవిష్యత్తు వైపు నడిపించడంలో ప్రధాని మోదీ అంకితభావాన్ని నొక్కిచెప్పిన రష్యా అధ్యక్షుడు పుతిన్.. పలు కీలక వ్యాఖ్యలు చేశారు.. యాదృచ్ఛికంగా, తను ప్రధానమంత్రి మోడీతో తరచుగా సంప్రదింపులు జరుపుతానని.. మేము అనేక విషయాలపై మాట్లాడుకుంటామని తెలిపారు.. వాస్తవానికి, మేక్ ఇన్ ఇండియా.. ఆయన చొరవ గొప్పది%ౌ% అంటూ పేర్కొన్నారు. మోదీ భవిష్యత్తును చూసే వ్యక్తి.. మేము అతనితో ఈ అవకాశాల గురించి ఎల్లప్పుడూ మాట్లాడుతాము.. అలా ఉంటేనే సమగ్ర అభివృద్ధి సాధ్యం అంటూ పేర్కొన్నారు. ప్రపంచంలో భారతదేశం అద్భుతమైన వృద్ధిని గుర్తిస్తూ.. ప్రధాని మోదీ ఆర్థిక విధానాలను కూడా రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రశంసించారు. "భారత్‌ను ఈ అభివృద్ధి వైపు, అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసరించే దిశగా ప్రధాని ఎల్లవేళలా కృషి చేస్తున్నారు.. ఫలితాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి" అంటూ పేర్కొన్నారు. "అభివృద్ధి చెందుతున్న దేశాలలో భారతదేశం అత్యధిక వృద్ధి రేటును ప్రదర్శిస్తోంది.. ఇది మిమ్మల్ని అభినందించాల్సిన విషయం" అని పుతిన్ నొక్కిచెప్పారు.. ఆర్థిక విస్తరణ, సాంకేతిక ఆవిష్కరణలను నడపడంలో భారతదేశం సాధించిన విజయాన్ని ఎత్తిచూపారు. భారతదేశం డైనమిక్ గ్రోత్ మరియు హైటెక్ పరిశ్రమలపై వ్యూహాత్మకంగా దృష్టి సారించడం కోసం ఎక్కువగా గుర్తింపు పొందుతున్న తరుణంలో రష్యా అధ్యక్షుడి వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. అదనంగా, పుతిన్ నుంచి ఈ ప్రశంసలు రష్యా %-% భారతదేశం మధ్య పెరుగుతున్న ద్వైపాక్షిక బలాన్ని కూడా నొక్కి చెబుతున్నాయి. ముఖ్యంగా, 2014లో ప్రధాని మోదీ ప్రారంభించిన 'మేక్ ఇన్ ఇండియా' ప్రచారం.. భారత్‌ను గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా మార్చడం, విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం, దేశీయ పరిశ్రమలను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుంది. అంతేకాకుండా, ఈ చొరవ భారతదేశాన్ని స్వయం-ఆధారిత దేశంగా (ఆత్మనిర్భర్ భారత్) మార్చడంపై దృష్టి సారించింది.. చివరికి దేశం ఎగుమతులను ప్రపంచవ్యాప్తంగా పెంచడంతోపాటు గణనీయమైన వృద్ధిని సాధించింది..

# జర్నలిస్ట్‌ను నేను కొట్టడం తప్పే

**మీడియాపై దాడి చేయాలని నేను అనుకోలేదు**

**ఆరోజు చీకట్లో ఈ ఘటన జరిగింది**

**మీడియా ముసుగులో నాపై దాడికి అవకాశం ఉందని ఆలోచించా**

**జర్నలిస్ట్‌కి తగిలిన దెబ్బకు నేను చాలా బాధపడుతున్నా**

**ఆ మీడియా ప్రతినిధి నా తమ్ముడు లాంటివాడు**

**అతని ఫ్యామిలీ గురించి నేను ఆలోచిస్తున్నా**

**కానీ.. నా ఫ్యామిలీ గురించి ఆలోచించేది ఎవరు?**

**నేను కేవలం సినిమాల్లో మాత్రమే నటిస్తా**

**జ జీవితంలో నటించను.. ఆ అవసరం కూడా నాకు లేదు**

**మరో ఆడియో వదిలిన మోహన్ బాబు**



**హైదరాబాద్, డిసెంబర్ 12:** జల్‌పల్లిలోని తన నివాసంలోకి మంచు మనోజ్ వెంట చొరబడిన జర్నలిస్ట్‌పై దాడి చేయడం తప్పేనని సీనియర్ నటుడు మోహన్ బాబు అంగీకరించారు. మంచు ఫ్యామిలీలో గత ఐదు రోజుల నుంచి వివాదం కొనసాగుతుండగా.. మంగళవారం రాత్రి గేట్లు తోసుకుంటూ తన అనుచరులు, మీడియా సభ్యులతో కలిసి మంచు మనోజ్ ఇంట్లోకి ప్రవేశించాడు. అదే సమయంలో అక్కడికి వచ్చిన మోహన్ బాబు ముందు మైక్ పెట్టిన ఒక జర్నలిస్ట్.. 'ఈ ఇష్యూపై మీరు ఏం చెప్తారు?' అని ప్రశ్నించారు. దాంతో సహనం కోల్పోయిన మోహన్ బాబు.. ఆ మైక్‌ను తీసుకుని జర్నలిస్ట్‌పై దాడి చేశారు. ఈ ఘటనలో జర్నలిస్ట్ తలకి గాయమై ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. జర్నలిస్ట్‌పై దాడి తర్వాత మోహన్ బాబు కూడా అస్వస్థతకి గురై.. ఆసుపత్రిలో చేరి చికిత్స అనంతరం గురువారం డిశ్చార్జ్ అయ్యారు. ఈ క్రమంలో ఇంటికి వెళ్లిన మోహన్ బాబు.. ఒక ఆడియో సందేశాన్ని విడుదల చేశారు. ఇందులో ఫ్యామిలీ వివాదంపై క్లారిటీ ఇవ్వడంతో పాటు జర్నలిస్ట్‌పై దాడి, దానికి గల కారణాన్ని కూడా మంచు మోహన్ బాబు వెల్లడించారు. దాడి ఘటనపై చింతిస్తున్నట్లు కూడా ఆయన చెప్పుకొచ్చారు. "మీడియాపై దాడి చేయాలని నేను అనుకోలేదు. ఆరోజు చీకట్లో ఈ ఘటన జరిగింది. మీడియా ముసుగులో నాపై దాడి చేసే అవకాశం ఉందని ఆలోచించా.. జర్నలిస్ట్‌కి తగిలిన దెబ్బకు నేను చాలా బాధపడుతున్నాను. ఆ మీడియా ప్రతినిధి నా తమ్ముడు లాంటివాడు.. అతని ఫ్యామిలీ గురించి నేను ఆలోచిస్తున్నాను. కానీ.. నా ఫ్యామిలీ గురించి ఆలోచించేది ఎవరు? నేను కేవలం సినిమాల్లో మాత్రమే నటిస్తాను. నిజ జీవితంలో నటించను.. ఆ అవసరం కూడా నాకు లేదు" అని మంచు మోహన్ బాబు వెల్లడించారు. 'నా ఇంట్లోకి చొరబడి నా ప్రశాంతతని దెబ్బతీశారు. ఒకవేళ నేను నా ఇంటి గేటు బయట అలా దాడి చేసి ఉంటే నాపై కేసులు పెట్టి అరెస్ట్ చేసుకోవచ్చు. అంతెందుకు నేనే పోలీస్ స్టేషన్‌కి వెళ్లి లొంగిపోతా. మా కుటుంబంలోని సమస్యని పరిష్కరించుకోవడానికి ఎవరూ మధ్యవర్తులు అవసరం లేదు. మేము కూర్చొని మాట్లాడుకుని .. సమస్యని పరిష్కరించుకుంటాం" అని మంచు మోహన్ బాబు ధీమా వ్యక్తం చేశారు. "మీడియాలో కేవలం నేను కొట్టిన విషయాన్నే ప్రస్తావిస్తున్నారు. నిజమే.. నేను అలా కొట్టడం తప్పే. కానీ.. ఏ సందర్భంలో కొట్టానో ఆలోచించాలి కదా? నేను ఎన్నో సేవా కార్యక్రమాలు చేశాను. అవన్నీ వదిలేసి.. కేవలం కొట్టిన విషయాన్నే పదే పదే ప్రస్తావిస్తున్నారు" అని మంచు మోహన్ బాబు మండిపడ్డారు. జల్‌పల్లిలో ప్రైవేట్ బౌన్సర్లతో మంచు మనోజ్, మంచు విష్ణు అక్కడ భయానక వాతావరణ సృష్టించారు. దాంతో ఇప్పటికే ఈ ఇద్దరిపై సొంత పూచీకత్తుతో బైండోవర్ చేసిన పోలీసులు.. మోహన్ బాబుని కూడా విచారణకి పిలిచారు. కానీ.. తెలంగాణ హైకోర్టు నుంచి డిసెంబరు 25 వరకూ పోలీసుల విచారణ నుంచి మోహన్ బాబు మినహాయింపు తెచ్చుకున్నారు.

# గురుకుల ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలి

**అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు ముఖి శేషాద్రి**





**తొలి సమయం, ఏటూర్ నాగారం, డిసెంబర్ 12**

గత ఇరవై ఏడు రోజుల నుండి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, లెక్చరర్లు తమను ఔట్ సోర్సింగ్ ఉద్యోగులనుండి కాంట్రాక్టు ఉద్యోగులుగా మార్పు చేయాలని చేస్తున్న రిలే దీక్షలకు అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం, ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జేఏసి సంపూర్ణ మద్దతును ప్రకటించాయి. రిలే దీక్ష శిబిరాన్ని సందర్శించి వారి సమస్య పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు ముఖి శేషాద్రి, అసోసియేట్ అధ్యక్షులు మాసాడ ఈశ్వరరావు అన్నారు.తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేస్తున్న గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాల ఔట్ సోర్సింగ్ చేస్తున్న డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిశీలించి, మెగా డీఎస్సీ లో రిక్రూట్మెంట్ నుండి ఈ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్న 1402 పోస్టులను మినహాయించాలని, గురుకుల ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు లెక్చరర్ లను కాంట్రాక్టు ఉద్యోగులుగా మార్చాలని, జి. ఓ. 3 స్థానంలో షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామకాల చట్టం చేసిన తరువాత ఏజెన్సీ ప్రాంతంలో స్పెషల్ డిఎస్సీ ప్రకటన ఇచ్చి ఆదివాసీ లకు పక్షపాతిగా ప్రభుత్వం నిలబడి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన ఎన్నికల హామీ ను నిలబెట్టుకోవాలని అఖిల భారత గిరిజన ఉద్యోగుల ఎ. ఎస్ ఆర్ జిల్లా అధ్యక్షులు,ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జేఏసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముఖి శేషాద్రి, సిపిఎస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాసాడ ఈశ్వరరావు ప్రభుత్వం ను డిమాండ్ చేశారు.

## మీడియా మిత్రులకు రక్షణ కల్పించాలి

**జిఎస్పీ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయిదోర**

**తొలి సమయం, నూగూర్ వెంకటాపురం, డిసెంబర్ 12**



గురువారం నాడు జిఎస్పీ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి దొర మాట్లాడుతూ సినీ నటుడు మోహన్ బాబు మీడియా ప్రతినిది పై దాడి హెయమైన చర్య అన్నారు.సినీ నటుడు మోహన్ బాబు మీడియా ప్రతినిది తలపై విచక్షణరహితంగా దాడి చేసిన మోహన్ బాబుపై క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మీడియా ద్వారా ప్రతి సమస్యలను తెలియజేసే మీడియా పై దాడి చేయడం సబబు కాదని అయన మండి పడ్డారు. ఏజెన్సీ సమస్యలు మీడియా ద్వారా నే పరిస్కారం అవుతాయని అయన అన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా పాత్ర కేయులకు రక్షణ కల్పించాలని అన్నారు. సినీ నటుడు మోహన్ బాబుమీడియా ప్రతినిది పై దాడిని తీవ్రంగా ఖండించారు. ఇలాంటి దాడి సంఘటనలు రాష్ట్రం లో మరల పునరావృతం కాకుండా కఠినమైన చట్టాలు ఏర్పాటు చేసి క్రిమినల్ కేసు పెట్టాలని అయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## తుడుం దెబ్బ మండల కమిటీ ఎన్నిక

**తొలి సమయం, నూగూర్ వెంకటాపురం, డిసెంబర్ 12**



ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలోని పాత్ర పురం గ్రామంలో గురువారం ఉదయం చింత సోమరాజు అధ్యక్షతన కార్యకర్త ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో జాతీయ కో కన్వీనర్ పొడెం రత్నం ఆదివాసులు కొన్ని వందల సంవత్సరాలుగా భూమి,నీరు, అడవి,సహజ వనరులపై,హక్కులు పొందుటకు పీరోచిత పోరాటాలు చేసి ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న హక్కులు, చట్టాలు, అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. ఆదివాసులు సాగు చేస్తున్న ప్రభుత్వ భూములకు, పోడు భూములకు, పూర్తిస్థాయిలో పట్టాలు పాలక ప్రభుత్వాలు ఇవ్వలేదని అన్నారు. ఎస్సీ,ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు అందని ద్రాక్ష గానే మిగిలాయని విద్య ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఆదివాసులకు దక్కే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగపరమైన ఆదివాసుల హక్కులు చట్టాలు అమలు చేసుకుంటూ కు పోరాటం చేయవలసిన అవసరం ఉన్నదని ఆదివాసులకు పిలుపునిచ్చారు.అనంతరం ములుగు జిల్లా అధ్యక్షులు వట్టం జనార్ధన్, వెంకటాపురం మండలం "తుడుం దెబ్బ "కమిటీని ఎన్నిక చేశారు. గౌరవ అధ్యక్షులు బొగ్గుల బిక్షపతి, అధ్యక్షులు బాడిస కిషోర్, కంటి ప్రశాంత్, పాయల వెంకటేశ్వర్లు, ఏక నరేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి పాయం కిరణ్, సహాయ కార్యదర్శి తాటి నాగేందర్, తుర్స నాగేష్, సోడు రమేష్, ప్రచార కార్యదర్శి పాయల శ్రీను, కోశాధికారి బొగ్గుల రాజు ,తదితరులు ఎన్నుకోవడం జరిగింది.

## అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అల్ఫోర్స్ అధినేత

**తొలి సమయం హుజురాబాద్,డిసెంబర్ 12**



మండలంలోని వంకాయ గూడెం శివారులోని అయ్యప్ప స్వామి ఆలయంలో అల్ఫోర్స్ అధినేత నరేందర్ రెడ్డి గురువారము ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పోలోజ్ సుమన్ శాస్త్రి ,గురు స్వామి చింతం సత్యనారాయణ, మాతంగి శ్రీనివాస్, అయ్యప్ప స్వాములు అయ్యప్ప మాల ధారణలో ఉన్న నరేందర్ రెడ్డి కి పూర్ణకుంభంతో ఆలయంలోకి స్వాగతం పలికారు.అయ్యప్ప స్వామి ఆలయంలో నరేందర్ రెడ్డి కి ప్రత్యేక పూజలు చేసి శాల తో సన్మానం చేశారు. అనంతరం స్వాములతో కలిసి అయ్యప్ప ఆలయంలో బిక్ష చేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప టెంపుల్ స్వాములు తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

**ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపట్టాలి**

**నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలి**

**వరంగల్ నగర అభివృద్ధిపై అధికారులతో సమీక్షించిన రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ వరంగల్ జిల్లా ఇన్-ఛార్జ్ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**




**తొలి సమయం, వరంగల్, డిసెంబర్ 12**

వరంగల్ నగర అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ వరంగల్ జిల్లా ఇన్-ఛార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ జిల్లా పర్యటనలో అక్కడి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అనేక హామీలు ఇచ్చారని, ఈ నేపథ్యంలో ప్రభుత్వ ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకుని వరంగల్ నగర అభివృద్ధి పనులను యుద్ధ ప్రతిపాదికన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వరంగల్ నగర అభివృద్ధిపై బుధవారం సచివాలయంలోని తన కార్యాలయంలో వరంగల్ జిల్లా మంత్రులు కొండా సురేఖ, ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డిలతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా వరంగల్ నగర అభివృద్ధి, ఐఆర్ఆర్, ఓఆర్ఆర్ , భద్రకాళి చెరువు, విమానాశ్రయం తదితర అంశాలపై ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రతి ప్రాజెక్టు కు సంబంధించిన డీపీఆర్ లను త్వరితగతిన తయారు చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. వరంగల్ నగరంలో నిర్మించే రింగ్ రోడ్డు జాతీయ రహదారులకు కనెక్టివిటీ ఉండేలా చూడాలని,ఈ ప్రాజెక్టుకు భూసేకరణను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని సూచించారు. ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణను యుద్ధప్రాతిపదికన భద్రకాళి చెరువు శుద్దీకరణపనులను వేగవంతంగా చేపట్టాలని ఆదేశించారు. ప్రాధాన్యత క్రమంలో పనులను చేపట్టి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ శాఖ కార్యదర్శి దాన కిశోర్, ఆర్ధిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ శ్రీదేవి, మైనింగ్ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, వరంగల్, హన్మకొండ జిల్లాల కలెక్టర్ లు డాక్టర్ సత్య శారదా, పి. ప్రావీణ్య, జిడబ్ల్యూ ఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాఖేడే తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రకటనలు కాదు కావల్సింది.. పథకాలు

**ఎక్స్‌వేదికగా మాజీ మంత్రి కేటీఆర్ ఎద్దేవా**

**హైదరాబాద్, డిసెంబర్ 12:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటనలతో కాలం గడుపుతుందని, కావల్సింది ప్రకటనలు కాదని పథకాలని అవి గుర్తుపెట్టుకుంటే మంచిదని మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్‌వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎద్దేవా చేశారు. కోతలు, కూతలు కాదు చేతలు కావాలంటూ చురకలంటించారు. అధికారంలోకి వస్తే ఎకరాకు ఏడాదికి రూ.15 వేలు అని ఊదరగొటారన్నారు. కానీ ఏడాదిగా ప్రకటనలతోనే కాలం వెళ్లదీస్తున్నారని మండిపడ్డారు. అర్హుల కోసం, అమలు కోసం మంత్రివర్గ ఉపసంఘం అని సభలు, సమావేశాలు పెట్టారని, ఏడాదిగా రైతుబంధు మీద కొండను తవ్వి ఎలుకను పట్టలేదు.. మంత్రివర్గ ఉప సంఘం నివేదిక ఊసేలేదు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం కోసం అబద్ధాలు చెప్పారని, అధికారం దక్కిన తర్వాత పథకాల ఎగవేతకు కుంటిసాకులు వెతుకుతున్నారని విమర్శించారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో ఆత్మవిశ్వాసంతో మీసం మెలేసిన రైతన్నలను.. ఏడాది కాంగ్రెస్ పాలనలోనే అప్పుల పాలు చేశారని మండిపడ్డారు. ఇప్పటికైనా కల్లు తెరవాలని సూచించారు. వర్షం కురుస్తుందో లేదో, సాగునీరు, కరెంట్, పెట్టిన పెట్టుబడికి తగిన దిగుబడి వస్తుందో.. లేదో? అని తెలియకున్నా భూమిని నమ్మి సేద్యం చేసి ప్రపంచానికి బువ్వను అందించే రైతన్నలకు భరోసా ఇవ్వాలన్నారు.

# అమెరికాలోని టెక్సస్ లో హైవేపై ఎమర్జెన్సీ ల్యాండింగ్

**కుప్పకూలిపోయి రెండు ముక్కలైన విమానం**

**టెక్సాస్,డిసెంబర్ 12:** అమెరికాలో దక్షిణ టెక్సాస్ హైవేపై బుధవారం ఓ చిన్న ట్విన్ ఇంజిన్ ప్రొపెల్లర్ విమానం మూడు కార్లను ఢీకొట్టింది. ఆ విమానం హైవేపై ఎమర్జెన్సీ ల్యాండింగ్ కు ప్రయత్నించిన సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్ గా మారింది. ఒక చిన్న విమానం దక్షిణ టెక్సాస్ హైవేపై క్రాష్ ల్యాండింగ్ కు ప్రయత్నించింది. అంతకు ముందు తక్కువ ఎత్తులో ఎగురుతూ, రోడ్డుపై వెళ్తున్న పలు వాహనాలను ఢీ కొట్టింది. అనంతరం హైవే పై ఉన్న ఒక బ్రిడ్జిని ఢీ కొట్టి నిలిచిపోయింది. ఈ ప్రమాదంలో ఆ చిన్న విమానం రెండు ముక్కలైంది. విమాన శకలాలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడడంతో ఆ హైవే పై భారీగా వాహనాలు నిలిచిపోయి, ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.టెక్సాస్ లోని విక్టోరియాలోని స్టేట్ హైవే లూప్ 463పై మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో నలుగురికి గాయాలు కాగా, ముగ్గురికి ప్రాణాపాయం తప్పింది. నాలుగో వ్యక్తిని మెరుగైన వైద్యం కోసం ప్రత్యేక కేంద్రానికి తరలించారు. హైవేపై ఎమర్జెన్సీ ల్యాండింగ్ కు ముందు విమానం తక్కువగా ఎగురుతూ పలు వాహనాలను ఢీకొట్టింది. విమానం ప్రమాదానికి ముందు రోడ్డుపైకి దిగుతున్న దృశ్యాలను సోషల్ మీడియా ఫుటేజీలో చిత్రీకరించారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని, పలువురికి గాయాలయ్యాయని విక్టోరియా పోలీస్ డిపార్ట్ మెంట్ డిప్యూటీ పోలీస్ చీఫ్ ఎలిన్ మోయా తెలిపారు.

ఎమర్జెన్సీ రెస్పాండెంట్స్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులకు సహాయం చేసి శిథిలాలను తొలగించారు. ఈ ప్రమాదంతో హైవేపై ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ ప్రాంతానికి దూరంగా ఉండాలని డ్రైవర్లకు సూచించారు. ఈ ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్ కు దారితీసిన సంఘటనలను క్రోడీకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. నేషనల్ ట్రాన్స్పోర్టేషన్ సేఫ్టీ బోర్డు (ఎన్టీఎస్బీ)కి సమాచారం అందించి మరింత లోతుగా దర్యాప్తు చేయాలని భావిస్తున్నారు. ఆ విమానం క్రాష్ ల్యాండ్ కావడాన్ని కొందరు వాహనదారులు తమ స్మార్ట్ ఫోన్స్ లో చిత్రించి, సోషల్ మీడియా లో పోస్ట్ చేశారు. విమానం అకస్మాత్తుగా దిగడం, తరువాత కూలిపోవడం ఆశ్చర్యానికి గురిచేసిందని సాక్షులు వర్ణించారు. "అది అలా పడిపోవడం చూస్తే భయం వేసింది" అని పేరు చెప్పడానికి ఇష్టపడని ఒక వ్యక్తి చెప్పారు. ప్రమాదం జరిగిన తర్వాత తాను విమానం వద్దకు వచ్చానని, పైలట్ స్పృహలో ఉన్నాడని, కానీ అతడిని బయటకు తీయలేకపోయానని వివరించారు.

## సత్యనారాయణపురం ఆరోగ్య కేంద్రం లో 108 సేవలు ప్రారంభం

**నూతన వాహనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు,ఐ టి డి ఏ పీఓ రాహుల్**

**తొలి సమయం, చర్ల, డిసెంబర్ 12**



తెలంగాణ ప్రజాప్రభుత్వ సహకారంతో ఏజెన్సీ ప్రాంత ప్రజల ఆరోగ్యం-వారి సంరక్షణే ధ్యేయంగా జిల్లా వైద్యశాఖావారి చొరవతో చర్ల మండల పరిధిలోని సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో నూతనంగా ఏర్పాటుచేసిన 108 వాహనాన్ని గౌరవ ఐటీడీఏ పీవో రాహుల్ గ సమన్వయంతో రిబ్బన్ కట్ చేసి సేవలను ప్రారంభించిన నియోజకవర్గ శాసనసభ్యులు ప్రజాసేవకులు తెల్లం వెంకటరావు ఈ సందర్భం లో ఎమ్మెల్యే వెంకట రావు మాట్లాడుతూ పేదలకు ఏ ఆరోగ్య సమస్య వచ్చిన వెంటనే అందుబాటులో 108వాహనం ఉన్నదని అందరు వినోయోగించుకోవాలని అన్నారు. అలాగే హాస్పిటల్ మరమత్తులు నిమ్మిత్తం రెండులక్షల ఇవ్వటం జరిగింది. ఈ కార్యక్రమంలోప్రభుత్వం వైద్యాధికారులు డా.దివ్యనాయన ,నగేష్ ఇతర సంబధిత అధికారులు, స్థానిక మండల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, హాస్పిటల్ సిబ్బంది బాబూరావు,ఉమారాణి, శ్రీదేవి తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లు పథకానికి సంబంధించి టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు

**జిల్లా కలెక్టర్ ప్రావిణ్య**

**తొలి సమయం, హన్మకొండ, డిసెంబర్ 12**

ఇందిరమ్మ ఇండ్లు పథకానికి సంబంధించి సందేహాలు నివృత్తి చేసేందుకు, ఫిర్యాదుల స్వీకరణకు సంబంధించిన వివరాల కోసం హనుమకొండ జిల్లా కలెక్టరేట్లో టోల్ ఫ్రీ నెంబర్ ను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రావిణ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు పథకానికి సంబంధించి టోల్ ఫ్రీ నెంబర్ 1800425115 ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ టోల్ ఫ్రీ నెంబర్ అన్ని పని దినాలలో ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తుందన్నారు. ఈ నెల 16వ తేదీ నుండి ఈ టోల్ ఫ్రీ నెంబర్ పని చేస్తుందన్నారు. ఇందుకుగాను 2బి హెచ్ కె జిల్లా నోడల్ అధికారులుగా శ్రీనివాసులు, 2బి హెచ్ కె మేనేజర్ శ్రీనివాసులు, అసిస్టెంట్ ఇంజనీర్ రమాదేవి సందేహాలను నివృత్తి చేస్తారని కలెక్టర్ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రజలకు సూచించారు.

## నారాయణపూర్‌లో ఎన్కౌంటర్

**ఏడుగురు మావోయిస్టులు మృతి**




**తొలి సమయం, చర్ల, డిసెంబర్ 12**

తెలంగాణ సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్గఢ్ బస్తర్ జిల్లా నారాయణపూర్‌లో భద్రతా బలగాలకు, నక్సలైట్లకు మధ్య జరుగుతున్న ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు నక్సలైట్లు మరణించారు. చనిపోయిన నక్సలైట్ల మృతదేహాలను సైనికులు స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌కౌంటర్ మరియు సెర్చ్ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోంది. నిజానికి బస్తర్ డివిజన్‌లో యాంటీ నక్సల్ సెర్చ్ ఆపరేషన్ జరుగుతోంది. డిసెంబరు 10న నారాయణపూర్, దంతేవాడ, జగదల్‌పూర్, కొండగావ్ జిల్లాకు చెందిన డీఆర్‌జీతో పాటు ఎస్టీఎఫ్, సీఆర్‌పీఎఫ్‌ల సంయుక్త బృందం దక్షిణ అబుజ్మద్ ప్రాంతానికి ( సైనికుల ఎన్‌కౌంటర్ నక్సలైట్లు ) బయలుదేరిందని నారాయణపూర్ ఎస్పీ ప్రభాత్ కుమార్ తెలిపారు. డిసెంబర్ 12వ తేదీ తెల్లవారుజామున 3 గంటలకు జాయింట్ సెక్యూరిటీ ఫోర్స్ టీమ్ మరియు నక్సలైట్ల మధ్య ఎన్‌కౌంటర్ ప్రారంభమైంది. అప్పటి నుంచి నక్సలైట్లు, భద్రతా బలగాల మధ్య అడపాదడపా ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయి. సెర్చ్ ఆపరేషన్‌లో ఇప్పటివరకు యూనిఫారం ధరించిన ఏడుగురు నక్సలైట్ల మృతదేహాలు లభ్యమయ్యాయి. ఎన్‌కౌంటర్ మరియు సెర్చ్ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోంది ( సైనికుల ఎన్‌కౌంటర్ నక్సలైట్లు ). ప్రచారం పూర్తయిన తర్వాత సమగ్ర సమాచారం అందజేస్తామని ఎస్పీ ప్రభాత్ కుమార్ తన ప్రెస్ నోట్‌లో తెలిపారు.

## తుడుందెబ్బ రాష్ట్ర నేత పొడెం బాబు అమ్మ దశ దిన కర్మ లకు హాజరైన రాష్ట్ర కమిటీ బృందం

**10 వేల ఆర్థిక సహాయం అందించిన తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు డా, మైపతి.అరుణ్ కుమార్**

**తొలి సమయం, ఏటూర్ నాగారం, డిసెంబర్ 12**



గురువారం నాడు ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర ముఖ్య నేత పోడెం బాబు తల్లి అయిన పోడెం బాయక్క దశ దిన కర్మలకు ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర జిల్లా కమిటీ ల నేతలు రాష్ట్ర వ్యాప్తంగా హాజరయ్యి నివాళులు అర్పించారు. అనంతరం తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు డా,మైపతి అరుణ్ కుమార్,10,000 రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఉద్యమ కారుల కుటుంబాలకు బాధక సాధకాల్లో అందరం ఒకరికి ఒకరం అండగా ఉండాల్సిన బాధ్యత సంఘా బాధ్యులపై ఉంటుంది అన్నారు. జిల్లా అధ్యక్షులు కొరగట్ల లక్ష్మన్ రావు, ఉపాధ్యక్షులు పాయం కోటేశ్వరరావు గౌర బోయిన మోహన్ రావు ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్య దర్శి కోర్ని బెల్లి గణేష్, గావిడి నాగ బాబు,కొప్పుల జగన్, నాలి సారయ్య కుంజ కృష్ణ ప్రసాద్ లు అందరూ పరామర్శించి నివాళి అర్పించారు

## పార్టీ కోసం పని చేసిన వారిని పట్టించుకోరా?

**హైదరాబాద్, డిసెంబర్ 12:** పార్టీ కోసం పని చేసిన వారిని, ఎన్నికల్లో గెలిచేందుకు కృషి చేసిన వారిని ఎవరూ పట్టించుకోరా? అని తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సొంత పార్టీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఏఐసీసీ కార్యదర్శి విష్ణు, దీపాదాస్ మున్షిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలో తాము సీనియర్లమని, తమను సంప్రదించకుండానే నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు.

## ఆర్థికంగా రాజకీయంగా
# మత్స్యకారులు ఎదగాలి
### అధ్యక్షులు పిట్టల రవీందర్ ముదిరాజ్




**తొలి సమయం, కరీంనగర్, డిసెంబర్ 12**
ఆర్థికంగా రాజకీయంగా మత్స్యకారులుఎదగాలనీ అధ్యక్షులు పిట్టల రవీందర్ అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని వాసర గార్డెన్ లో కరీంనగర్ జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘ సర్వసభ్య సమావేశం గురువారం జిల్లా అధ్యక్షుడు పిట్టల రవీందర్ ముదిరాజ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రవీందర్ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను మత్స్యకారులు సద్వినియోగపరచుకొని ఆర్థికంగా రాజకీయంగా ఎదగాలని కరీంనగర్ జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు పిట్టల రవీందర్ ముదిరాజ్ అన్నారు, జిల్లా ఉపాధ్యక్షులు పెసరు కుమారస్వామి ముదిరాజ్ మాట్లాడుతూ.. అధికారులు సంఘాల అభివృద్ధికి కృషి చేయాలని,మత్స్యకారుల సమస్యల పైన అధికారులు త్వరగా స్పందించాలని, అన్నారు.జిల్లా మత్స్య శాఖ అధికారి విజయభారతి మాట్లాడుతూ... సంఘాల అధ్యక్షులు సంఘాలను రెన్యువల్ చేసుకోవాలని, సంఘాలలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే త్వరగా పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.సర్వసభ్య సమావేశంలో మేనేజింగ్ డైరెక్టర్ మంజుల ఆదాయ, వ్యాయాలను సంఘ సభ్యులకు వివరించారు.సంఘాలు సకాలంలో కార్యవర్గ,సర్వసభ్య సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలనీ తెలిపారు.ఈ కార్యక్రమం లో సూపర్డెంట్ వెంకటేశ్వర్లు,జిల్లా డైరెక్టర్లు అరిగే ప్రభాకర్ ముదిరాజ్, గుండ కుమార్ ముదిరాజ్, గొడుగు సమ్మయ్య ముదిరాజ్, జక్కుల బాబు ముదిరాజ్, పప్పు సమ్మయ్య ముదిరాజ్,భాషవేణి శ్రీనివాస్ ముదిరాజ్,బోళ్ల సుధాకర్ ముదిరాజ్,మోటం వెంకటేష్ ముదిరాజ్,రేగుల రాజేందర్ కుమార్ ముదిరాజ్,జిల్లాలోని మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు,సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# విజయవంతమైన మెడికల్ అసోసియేషన్ వారి ఉచిత వైద్య శిబిరం
### త్వరలో మరిన్ని సేవా కార్యక్రమాలు అధ్యక్షులు డా. కొల్లూరి



**తొలి సమయం, పెడన, డిసెంబర్ 12**
విజయవాడకు చెందిన ప్రవీణ్ హాస్పిటల్, ప్రవీణ్ కార్డియాక్ సెంటర్, పెడన పట్టణ హోల్ సేల్ అండ్ రిటైల్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక శ్రీ వాసవి ప్రార్థన మందిరం నందు ఏర్పాటుచేసిన గుండె వ్యాధులు, మెదడు నరాలు సంబంధించిన వ్యాధుల ఉచిత వైద్య శిబిరం విజయవంతమైనది. ఈ వైద్య చికిత్స శిబిరాన్ని పెడన పట్టణ హెూల్సేల్ అండ్ రిటైల్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు, గౌరవ డాక్టరేట్ అవార్డు గ్రహీత డా. కొల్లూరి చిన్నా ప్రారంభించారు. ఈ సందర్భంగా డా. కొల్లూరి మాట్లాడుతూ పెడన పట్టణ పరిసర ప్రాంత పేద ప్రజలకు వైద్య సేవలను అందించే అవకాశం మాకు కల్పించిన ప్రవీణ్ హాస్పిటల్స్ ఎండి డాక్టర్ మద్దిరాల ప్రవీణ్ ఎండి డిఎం, వారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ ఇక ముందు కూడా పెడన పట్టణ హెూల్సేల్ అండ్ రిటైల్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి తగు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు డా. కొల్లూరి. ఈ శిబిరము నందు ప్రవీణ్ కార్డియాక్ సెంటర్ హాస్పిటల్ కి చెందిన ప్రముఖ డాక్టర్ పోలగని విశ్వనాథ్ ఎండి డిసి, వారి వైద్య బృందం వారు గుండెకు సంబంధించిన వ్యాధులు, మెదడు నరాలు సంబంధించిన వ్యాధులతో బాధపడుతున్న వారికి ఈసీజీ, 2 డి ఏకో, గుండె ఈకో స్కానింగ్ పరీక్షలు ఉచితముగా నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ వైద్య శిబిరం నందు పెడన పట్టణ పరిసర ప్రాంత ప్రజలు150 మందికి వైద్య సేవలను అందించారు. పట్టణ హెూల్సేల్ అండ్ రిటైల్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి ఆత్మకూరి సురేష్ కుమార్ పర్యవేక్షణ లో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కొల్లిపర పూర్ణ ప్రదీప్ కార్యవర్గ సభ్యులు తాడిపర్తి సునీల్ తమ్మన సంతోష్, మద్దుల వంశీ,13 రాకెట్స్ గ్రూప్ సభ్యులు పలువురు తమ అమూల్యమైన సేవలను అందించారు.



# రేకుల షెడ్డు నిర్మాణానికి లక్ష విరాళం

**హుజురాబాద్ గ్రంథాలయంలో స్టడీ మెటీరియల్ పంపిణి**

**పట్టభద్రులంతా ఈ అవకాశన్ని సధ్వినియోగం చేసుకోవాలి**

**పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి**



**తొలి సమయం, హుజురాబాద్, డిసెంబర్ 12**
హుజురాబాద్ గ్రంథాలయంలో అదనపు గది రేకులషెడ్డు నిర్మాణానికి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి 1లక్ష విరాళం అందజేసి నిర్మాణం పూర్తి కావడం తో నేడు ప్రారంభించారు. గురువారం హుజురాబాద్ పట్టణ కేంద్రం లోని గ్రంథాలయాన్ని సందర్శించి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతీ యువకులకు విఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుజురాబాద్ మార్నింగ్ వాక్ ప్రచారానికి వచ్చినప్పుడు గ్రంథాలయ నిర్మాణానికి రేకుల షెడ్డు విషయం తన దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించి లక్ష రూపాయలతో నిర్మాణం చేపట్టామని వెల్లడించారు. గ్రంథాలయాల బలోపేతానికి వంతు కృషి చేస్తానని వెల్లడించారు. గతంలో గెలిసిన ఎమ్మెల్సీలు పట్టభద్రుల సమస్యలను పట్టించుకోలేదని ఉద్యోగ నిరుద్యోగ పట్టభద్ర సమస్యల పరిష్కారానికి తాను ఎల్లవేళల కృషి చేస్తానని ధ్యేయంగా పనిచేస్తున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్సీ పరిధిలోని ఉమ్మడి నాలుగు జిల్లాల పరిధిలోని గ్రంథాలయాల్లో మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తన దృష్టికి రావడంతో చాలా చోట్ల తన సొంత నిధులతో మౌలిక సదుపాయాలు కల్పించినట్టు వెల్లడించారు. నిజామాబాద్ గ్రంథాలయంలో తన సొంత నిధులతో మధ్యాహ్న భోజనం, గ్రంథాలయంలో చేర్ పాడ్స్, షింటేక్ వాటర్ ట్యాంకు ను అందజేసినట్లు వెల్లడించారు. నిరుద్యోగ నిర్మూలకు తన కృషి చేస్తానని ప్రజాసేవ చేసేందుకే తను ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నట్టు వెల్లడించారు.పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ పట్టభద్రులకు విఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన స్టడీ మెటీరియల్ ను ఆయన అందజేశారు. రానున్న పట్టభద్రులు ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కనక లక్ష్మి, తిప్పారపు సంపత్, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ , గవ్వ వంశీధర్ రెడ్డి, పంజాల శ్రీనివాస్ పలువురు నాయకులు పాల్గొన్నారు




## పెంచిన డైట్ చార్జీలకు అనుగుణంగా విద్యార్థులకు
# నాణ్యత ప్రమాణాలతో కూడిన పౌష్టిక ఆహారం అందించాలి
**- ఈనెల 14న గురుకుల హాస్టళ్ల లో ప్రత్యేక కార్యక్రమం : జిల్లా కలెక్టర్ పి.ప్రావిణ్య**



**తొలి సమయం, హన్మకొండ, డిసెంబర్ 12**
హనుమకొండ జిల్లాలోని అన్ని గురుకుల హాస్టళ్లలో ఈనెల 14వ తేదీన ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రావిణ్య తెలిపారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో గురుకుల హాస్టల్ విద్యార్థుల కోసం ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ ప్రభుత్వం గురుకుల హాస్టల్ విద్యార్థులకు 40 శాతం డైట్ చార్జీలను పెంచిందన్నారు. అదేవిధంగా 16 సంవత్సరాల తర్వాత ప్రభుత్వం కాస్మోటిక్ చార్జీలను 200% పెంచిందని పేర్కొన్నారు. గురుకుల విద్యార్థుల కోసం పౌష్టిక ఆహారాన్ని అందిస్తుందన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ లో అంతర్జాతీయ విద్య ప్రమాణాలతో పాటు ఇతర మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. గురుకుల హాస్టల్ విద్యార్థులకు నాణ్యత ప్రమాణాలతో కూడిన పౌష్టికాహారాన్ని విద్యార్థులకు అందిస్తుందన్నారు. ఈనెల 14వ తేదీ నుండి అమలయ్యే నూతన డైట్, కాస్మోటిక్ చార్జీల పై జిల్లాలోని ప్రతి గురుకుల హాస్టల్ లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా, జోనల్, మండల స్థాయి అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. సంబంధిత గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఈ కార్యక్రమానికి హాజరయ్యేలా చూడాలన్నారు.

## తిమ్మాపూర్‌లో షార్ట్ ఫిలిం షూటింగ్‌ను
## ప్రారంభించిన సొల్లు అజయ్ వర్మ



**తొలి సమయం,తిమ్మాపూర్,డిసెంబర్ 12**
తిమ్మాపూర్ గ్రామంలో లో కట్ట కింది పొలం కౌలుకిస్తే అనే షార్ట్ ఫిలిం షూటింగ్ ను బిజెపి రాష్ట్ర నాయకులు తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు సొల్లు అజయ్ వర్మ ప్రారంభించారు. దూలం థియేటర్ యూట్యూబ్ ఛానల్ లో దూలం తిరుపతి గౌడ్ నిర్మాణ సారధ్యంలో డైరెక్టర్ రాము రామ్మోహన్ ఈ షార్ట్ ఫిలింను తెరకెక్కిస్తున్నారు. ఇట్టి లఘు చిత్రం షూటింగ్లో యాక్టర్స్ దూలం తిరుపతి గౌడ్, క్రిటిక శ్రీ కోడి శ్రీనివాస్, పురుషోత్తం, జగదీష్ హరీష్ ,కెమెరామెన్ సంతోష్ యాదవ్ తదిరులు పాల్గొన్నారు.

## ఈ నెల 14న జాతీయ మెగాలోక్ అదాలత్
**రాజీయే రాజమార్గం**

**లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి**

**వరంగల్ పోలీస్ కమిషనర్ కిషోర్ ఝా**



**తొలి సమయం వరంగల్ డిసెంబర్ 12**
ఈ నెల 14న జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఈ నెల 14న జాతీయ మెగా లోక్ అదాలత్ ఉన్నందున రాజీ పడదగిన కేసులలో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుంబపరమైన కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ మొదలగు కేసుల్లో కక్షిదారులు రాజీ పడే అవకాశం ఉంటుంది అని తెలిపినారు. రాజీయే రాజ మార్గమన్నారు. చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బులను వృథా చేసుకోవద్దన్నారు. జుడిషియల్ డిపార్ట్మెంట్ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.జిల్లా లోని పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్ లు మరియు ఇతర పోలీస్ సిబ్బంది రాజీ పడ్డ దగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీ పడేటట్లు అవగాహన కల్పించడం జరుగుతుంది. కావున ఎవరైనా తమ కేసులలో రాజీ కావాలి అనుకున్నవారు పోలీస్ అధికారులకు సంప్రదించాలని, లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుంది అని పోలీస్ కమిషనర్ తెలిపారు

## సీఎం చెప్పినా కదలని అధికారులు
**సోలార్ సమస్యపై జాయింట్ కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు**


**నిర్లక్ష్యం నీడలో ఎస్సీ గురుకులాలు**

**గురుకులాల విద్యార్థుల హక్కుల పోరాట కమిటీ రాష్ట్ర కన్వీనర్ మొగురం రమేష్**



**తొలి సమయం కరీంనగర్, డిసెంబర్ 12**
రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎస్సీ గురుకులాల్లో ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని ఇప్పటికే జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే గతంలోని సోలార్ సిస్టం ద్వారా విద్యార్థులకు చలికాలంలో వేడి నీళ్లు అందించాలని అధికారులకు సీఎం ఆదేశాలు ఇచ్చారు. సీఎం ఆదేశాలని జిల్లా అధికారులు పట్టించుకోవడంలేదని గురుకులాల విద్యార్థుల హక్కుల పోరాట కమిటీ రాష్ట్ర కన్వీనర్ మొగు రం రమేష్ అన్నారు.వివరాల్లోకి వెళితే మానకొండూరు దేవంపల్లి గురుకుల పాఠశాలలో సోలార్ సిస్టం ఉన్నప్పటికీ అవి పని చేయకపోవడంతో పిల్లలకు వేడి నీళ్లు అందించడం లేదని దేవంపల్లి గురుకుల పేరెంట్స్ సోమవారం ప్రజావాణిలో ఇప్పటికే జాయింట్ కలెక్టర్ కు వినతి పత్రం అందజేయడం జరిగింది. అయినప్పటికీ సోలార్ సిస్టం అధికారులు , ఇంజనీరింగ్ అధికారుల్లో చలనం లేకుండా పోయింది అన్నారు.ప్రభుత్వం ఏం చెప్పినా అధికారులు నిర్లక్ష్యం తో పట్టించుకోక పోవడంతో ఎస్సీ గురుకుల విద్యార్థులు చలికాలంలో చల్ల నీళ్లతో చలికి గజగజ వణుకుతూ స్థానాలు చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే సోలార్ సిస్టం రిపేర్ చేయించాలని కోరుచున్నామన్నారు. లేనియెడల గురుకుల తల్లిదండ్రులం కరీంనగర్ కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తామని అన్నారు

## టియుడబ్ల్యూజే (ఐజేయు)
## జిల్లా కార్యవర్గ సభ్యునిగా సారబుడ్ల రాజిరెడ్డి



**తొలి సమయం కరీంనగర్, డిసెంబర్ 12**
టియుడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా కార్యవర్గ సభ్యునిగా సైదాపూర్ మండలం వెన్నంపల్లి గ్రామానికి చెందిన సారబుడ్ల రాజిరెడ్డి గెలుపొందారు. టియుడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా ఎన్నికలు ఎల్ఎండి కాలనీ శ్రీ తాపాల లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణ మండపంలో బుధవారం జరగగా ఎన్నికలకు సంబంధించిన కార్యవర్గ సభ్యుల ఓట్ల లెక్కింపు గురువారం కరీంనగర్ ప్రెస క్లబ్ లో జరిగాయి.ఈ ఓట్ల లెక్కింపులో సైదాపూర్ మండలానికి చెందిన సారబుడ్ల రాజిరెడ్డి133 ఓట్లతో గెలుపొందారు.జిల్లా కార్యవర్గ సభ్యునిగా గెలుపొందిన రాజిరెడ్డికి సైదాపూర్ మండల విలేకరులు బండారు గట్టయ్య, మొలుగూరి తిరుపతి, పెరుమాండ్ల రాజబాబు, దొనికెన వేణుగోపాల్,కండె కరుణాకర్,బొద్దుల తిరుపతి, అనగోని తిరుపతి,పర్శ చంద్రమౌళి,పత్తిపాక ప్రవీణ్, రఘుపతి,నమిండ్ల రాజేశ్వరరావు, రఫీ,వినయ్ కుమార్,గున్నాల కృష్ణమూర్తి, పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

## పదకొండుమంది మావోయిస్టులు లొంగుబాటు
**తొలి సమయం చర్ల/ డిసెంబర్ 12**



తెలంగాణ సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్గఢ్ సుక్మా జిల్లాలో 11 మంది నక్సలైట్లు పోలీసు అధికారుల ఎదుట లొంగిపో యారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నియాద్ నెలనార్ పథకం కింద ఆకర్షితులై జనజీవన స్రవంతిలోకి వచ్చినట్లు సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ తెలిపారు.సుక్మా జిల్లాలోని చింతల్నార్, జేగురుకొండ పోలీసు స్టేషన్ పరిధిలో గల పలు గ్రామాలకు చెందిన నక్సల్స్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పునరావాస విధానం ద్వారా ఆకర్షితులై అగ్నాతం వీడి బయటకు వచ్చినట్లు తెలిపారు.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST:MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101